క్లుప్తంగా

డిపో మేనేజర్ బాధ్యతలు స్వీకరణ


తిరుపతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ నూతన డిపో మేనేజర్‌గా తిరుపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ప్రస్తుత డిపో మేనేజర్ రామారావుకు డిపో సిబ్బంది వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రామారావు మాట్లాడుతూ.. భద్రాచలంలో విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని, డిపో సిబ్బంది సహాయ సహకారాలతో డిపోను సమర్థవంతంగా నడపగలిగామని అన్నారు. నూతన డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన తిరుపతికి కూడా డిపో అధికారులు, సిబ్బంది అన్ని విధాల సహకరించి, డిపో అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. డిపో స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో సీఐ గౌతమి, పట్టణ ప్రముఖుడు దుర్గాప్రసాద్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చర్ల: మండలంలోని 17 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. పేదింటి కుటుంబాల్లో జరుగుతున్న ఆడపిల్లల వివాహాలకు ఆర్థికంగా సాయం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని కొనసాగిస్తూ వస్తున్నారని అన్నారు.

'సీతారామ' నీరు ఏజెన్సీకి ఇవ్వాలి

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలోని ఏజెన్సీ ప్రాంతాలకు సాగునీరివ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకురాలు సున్నం భూలక్ష్మి డిమాండ్ చేశారు. కృష్ణసాగర్ గ్రామపంచాయతీలోని చింతాలక్ష్మీనగర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏజెన్సీ రైతులకు సీతారామ నుంచి సాగునీరు అందించిన తరువాతనే ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. సమావేశంలో నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, జక్కం కొండలరావు, దుర్గం ప్రణయ్, మంగీలాల్, పెదగోని ఆదిలక్ష్మి, కొడిమి రాధ, కప్పల సూర్యకాంతం, రాపర్తి లక్ష్మి, కుర్సం సుజాత, లక్ష్మీనారాయణ, మర్ల కృష్ణ పాల్గొన్నారు.

ఆదివాసీ మేధోమధనంలో నాయకులు

అశ్వాపురం: తెలంగాణ రాష్ట్ర స్థాయి షెడ్యూల్ ఏరియా ప్రాంత పరిరక్షణపై ఆధార్ సొసైటీ, ఏఈడబ్ల్యూసీఏ, ఏఎంసీఎస్, ఏఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గురుస్వామి సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మేధోమధనంలో మండలం నుంచి పలు ఆదివాసీ సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఆధార్ సొసైటీ రాష్ట్ర నాయకుడు పొడియం బాలరాజు, ఏఈడబ్ల్యూసీఏ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్సం నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు, ఏటీఏ నాయకుడు పూనెం వెంకటేశ్వర్లు, ఇర్పా వెంకటేశ్వర్లు, జేఏసీ నాయకులు ఇర్పా నరసింహారావు తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

ఎస్సై శ్రీనివాస్‌కు నివాళి

అన్నపురెడ్డిపల్లి: ఇటీవలె పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌కు అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మౌనం పాటించి, మృతుని కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

ఎస్సై కుటుంబానికి వితరణ

అశ్వారావుపేటరూరల్: ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ దశదిన కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఎస్సై చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సై భార్య కృష్ణవేణికు రూ.25 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి ఆయన అందజేశారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి మోహంత్ గత జనవరి నెలలోమండల కేంద్రంలో తన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా.. ఐఎంఈ నంబర్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి బుధవారం కరకగూడెం ఎస్సై రాజేందర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

బ్యాంబో క్లస్టర్ సందర్శన

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామశివారులోని బ్యాంబో క్లస్టర్‌ను బుధవారం ఎస్సై గంజి స్వప్న సందర్శించారు. వెదురుతో తయారు చేస్తున్న ఉత్పత్తులను ఆమె ఆసక్తిగా తిలకించారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆదివాసీ యువకులు బ్యాంబో క్లస్టర్‌ను ఏర్పాటు చేసి పేదలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఈసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య పాల్గొన్నారు.

కొరవడిన 'ఆదర్శ'ం..

- నత్తనడకన పాఠశాల అభివృద్ధి పనులు
- నాసిరకం మెటీరియల్ వినియోగం
- అమ్మ ఆదర్శ పాఠశాలలో తీరిది..

చర్లరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం, పాఠశాలల అభివృద్ధి కోసం అనేక నిధులు వెచ్చిస్తోంది. కానీ ఆ అభివృద్ధి పనులే కొందరు కాంట్రాక్టర్ల పాలిట వరాలుగా మారాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో అడుగు పెట్టే విద్యార్థులకు తమ ఇంటి కంటే పాఠశాల వాతావరణమే మంచిగా ఉండాలని అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించింది. గ్రామ కమిటీల ద్వారా పనులు చేయాల్సి ఉండగా.. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తి కావాల్సి ఉండగా మండలంలో చాలా పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి.

నాసిరకంగా సామాన్లు..

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో ఎంతో జాగ్రత్తకరమైన విద్యుత్ పనుల్లో భాగంగా గోల్డ్ మెడల్ కంపెనీకి చెందిన పరికరాలనే వాడాలనే నిబంధన


నాసిరకమైనవిగా భావిస్తున్న వైర్ల బాక్సులు

ఉన్నప్పటికీ.. కొంతమంది కాంట్రాక్టర్లు వాటికి బదులుగా బెస్త కొత్తూరు పాఠశాలలో నాసిరకమైన రమేష్ కంపెనీ వైర్లు, విద్యుత్‌ను కంట్రోల్ చేసే యంసిలు దుమ్ కంపెనీవి ఏర్పాటు చేశారు. నాసిరకమైన విద్యుత్ పరికరాలు ఉపయోగిస్తే పిల్లలకు ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు. పనులు జరిగే సమయంలో అధికారుల పర్యవేక్షణ ఉంటే మరి నాసిరకపు పనులు ఎలా జరిగాయనేది అంతు చిక్కని ప్రశ్న.


బెస్త కొత్తూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎంసీబీ

చర్యలు తీసుకుంటాం



చాలా చోట్ల ఇంకా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి కాలేదు. వర్షాల వల్ల పనులు నిలిచాయి. పనుల్లో నాసిరకమైన పరికరాలు వాడినట్లయితే వాటిని తొలగించి నాణ్యమైనవి ఏర్పాటు చేయిస్తాం. నాణ్యత పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

– పి.శ్రీనివాసరావు, ఐటీడీఏ ఏఈ, భద్రాచలం

త్యాగానికి ప్రతీక మొహర్రం

మహోన్నత త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను బుధవారం పలు ప్రాంతాల్లో కుల, మతాలకు అతీతంగా జరుపుకున్నారు. న్యాయం, ధర్మం, సత్యం కోసం యుద్ధాలు చేసి అమరగతిని పొందిన హజ్రత్ ఇమామ్ హసేన్, ఇమామ్ హుస్సేన్ త్యాగాలని ప్రతి ఒక్కరూ స్మరించుకున్నారు. హిందూ, ముస్లింలు పీర్లను ఊరేగిస్తూ మత సామరస్యాన్ని చాటుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు గ్రామాల్లో భక్తులు పూలు, దట్టీలు సమర్పించారు. పీర్ల ఎదుట డప్పుల చప్పుడులతో ఆడిపాడిన అలయ్‌బలయ్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు నుంచి ఊరేగింపుగా వస్తున్న పీరీలు


అశ్వాపురం: అమ్మగారిపల్లిలో పీరీల ఊరేగింపులో స్థానికులు


కరకగూడెం: పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


చంద్రుగొండ: రేపల్లెవాడలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు


మణుగూరుటౌన్: పీరీల ఊరేగింపులో పాల్గొన్న మణుగూరు యువకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గోదావరి ముంపు గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రరెడ్డి

పినపాక: గోదావరి వరదలకు పలు గ్రామాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రవీంద్రరెడ్డి ప్రజలకు సూచించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని వరద ముంపు ప్రాంతాలైన భూపతిరావుపేట, రాయి గూడెం గ్రామాల్లోని గోదావరిని పరిశీలించి అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సహకరించాలని కోరారు. గోదావరి ప్రవాహం, వరదలపై ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ..

పోలీసులు ఆదివాసి గ్రామంలో పర్యటించి వారితో ముచ్చటించాలని డీఎస్పీ రవీంద్రరెడ్డి అన్నారు. బుధవారం బయ్యారం పోలీస్ స్టేషన్‌ని తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. నక్సల్స్ ప్రాబల్య ప్రాంతం కాబట్టి అప్రమత్తంగా ఉండి అసాంఘిక శక్తుల గురించి ఆదివాసీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

మణుగూరురూరల్: పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నేడు నిర్వహించే కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు కోరారు. మండల పరిధిలోని పగిడేరు, పెద్దపల్లి, ఎస్టీ కాలనీ, విప్పలగుంపు, సాంబాయిగూడెం, విజయనగరం, కమలాపురం, రాయగూడెం, రేగులగండి, కూనవరం తదితర గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బొల్లం రాజు, ఈశ్వర్‌రావు, లెనిన్‌బాబు, నరసింహారావు, మడి నరసింహారావు, ఉంగయ్య, గంగయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: పోడుభూముల పట్టాల కోసం, బోర్లు, త్రీఫేస్ విద్యుత్ కోసం రైతులు ఉద్యమించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గోపాలపురం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేడు పోడుభూముల పట్టాల కోసం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో పోడురైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. పాండవుల రామనాథం, పెద్దిరాజు, తాటి రాము, సెర్పా భద్రమ్మ,తాటి కల్పన పాల్గొన్నారు.

బ్రిడ్జి రహదారి పరిశీలన

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల బ్రిడ్జి ఓ వైపు రహదారి మట్టి వర్షాలకు కొంత కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో మంగళవారం రాత్రి పంచాయతీ అధికారులు పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీలను బ్రిడ్జి రహదారికి ఇరువైపులా పెట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూశారు. ఈ క్రమంలో బుధవారం ఇరిగేషన్ ఏఈఈ సక్రు, కరకగూడెం ఎస్సై రాజేందర్ సదరు ప్రాంతాన్ని సందర్శించి ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తోలి యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. రహదారికి రక్షణగా ఇసుక బస్తాలతో వరదను తట్టుకునేలా బందోబస్తు చేసారు.అనంతరం ఎస్సై కోతకు గురవుతున్న బూడిదవాగును రోడ్డును పరిశీలించి సంబంధిత అధికారులకు విషయాన్ని తెలియపరచి వెంటనే మరమ్మతులు చేయాలనీ కోరారు. కార్యక్రమాల్లో పలు శాఖల అధికారులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


కరకగూడెం: బ్రిడ్జి రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

పెండింగ్ డీఆర్ విడుదల చేయాలి

అశ్వారావుపేటరూరల్: పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఆర్‌ను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి శరత్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ కమిటేషన్ రికవరీ పిరియడ్‌ను 15 నుంచి 12 ఏళ్లకు తగ్గించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు వెస్లీ, మండల శాఖ అధ్యక్షుడు పి.పుల్లయ్య, స్వామిదాసు, బ్రహ్మారావు, భూషణ్‌రావు, సుధాకర్, రాములు, నారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఆషాఢ మాసం శుక్ల తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు వేకువజామునే నిద్రలేచి ఇళ్ల వాకిళ్లను శుభ్రం చేసుకున్నారు. అభ్యంగన స్నానాలు ఆచరించి ఇంట్లోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సమేతంగా సమీప ఆలయాలకు వెళ్లి అమ్మవార్లు, స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అన్నపురెడ్డిపల్లి: పారాయణం చదువుతున్న మహిళలు


అశ్వారావుపేటరూరల్: గణపతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భోజనశాల ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకబంజర గ్రామంలోని అభినవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాంపురం గ్రామానికి చెందిన బెల్లి బాబురావు ఆర్థిక సహకారంతో ప్రతి శనివారం జరిగే అన్నదాన కార్యక్రమం కోసం భోజనశాలను నిర్మించారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భోజనశాలను డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ప్రారంభించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ గాదె జయ, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, గ్రామపెద్దలు వీరమాచనేని రాజశేఖర్, అక్కిన అచ్చుత రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సరస్వతి

మణుగూరుటౌన్: జిల్లా హిందు వాహిని సంఘటన్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా చిర్రా సరస్వతి నియమితులయ్యారు. ఈ మేరకు హిందు వాహిని సంఘటన్ రాష్ట్ర అధ్యక్షురాలు మద్దూరు భార్గవరెడ్డి బుధవారం ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ.. తనపై పూర్తి నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని తేగడ గ్రామంలో బుధవారం వైద్య సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వైద్య సిబ్బంది తిరిగి నీటి నిల్వలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను కట్టుకోవాలని సూచించారు.

నేడు గ్రామ సభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నేడు గ్రామ సభ నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధుల ఉదయం 10:30 గంటలకు సూపర్ బజార్ రోడ్డులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే గ్రామ సభకు హాజరు కావాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: మండలంలోని అభయాంజనేయ స్వామి ఆలయం జంక్షన్ వద్ద మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదేశాలు సీఐ సతీష్‌కుమార్ సూచనల మేరకు ఏఎస్సై నిజాం అలీ బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలను, కార్లను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వాహనాలకు సంబంధింత పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా, నిబంధనలు అతిక్రమించి వాహనాలు పడుపుతున్న వాహనదారులకు ఈ-చలానా విధించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేయరూ..


ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన పాతిరెడ్డి పాలెం ప్రధాన రహదారి

పినపాక: ఇటీవల కురిసిన వర్షాలకు పాత రెడ్డిపాలెం ప్రధాన రహదారి కోతకు గురవుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం గోదావరి వరదలకు పాతిరెడ్డిపాలెం ప్రధాన రహదారి మోకాల్లోతు నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం నూతన రహదారి నిర్మించిన ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర కోతకు గురై ఇబ్బందికరంగా మారింది. ఇలాగే వర్షాలు, వరదలు వస్తే పూర్తిగా రోడ్డు ధ్వంసమై రాకపోకలు నిలిచిపోతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల స్పందించి మరమ్మతులు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

హామీలను అమలు చేయాలి

దమ్మపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను, బేషరతుగా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము డిమాండ్ చేశారు. బుధవారం మాస్‌లైన్ పార్టీ మండల సమావేశం మండలంలోని లింగాలపల్లి గ్రామంలో నిర్వహించారు. సమావేశంలో అమలు చేయాల్సిన ఎన్నికల హామీలపై డిమాండ్లతో కూడిన కరపత్రాలను, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. రైతుల రుణాలను వెంటనే రద్దుచేసి, కొత్త రుణాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో తొడెం దుర్గమ్మ, కుర్సం ముత్యాలరావు, బండి ఆదినారాయణ, కేసరి వెంకటేష్, రాముడు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

లోపభూయిష్టంగా రుణమాఫీ ఉత్తర్వులు

కరకగూడెం: లోపభూయిష్టంగా రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని టీడీపీ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చందా మధు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం చిరుమళ్ల గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంఖ్యను కుదించేందుకే రుణమాఫీ మార్గదర్శకాలు ఉన్నాయని, రైతుల గుర్తింపునకు రేషన్ కార్డు ప్రామాణికం అనడం సరికాదని పేర్కొన్నారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీ రైతులకూ వర్తింపజేయండి..

అశ్వాపురం: ఏజెన్సీలో బ్యాంక్‌లలో రైతు రుణాలు తీసుకున్న ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ పథకం అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. అశ్వాపురంలో బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం యువజన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో గతంలో బ్యాంక్‌లలో పహాణీలపై రుణాలు పొందిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

నిబంధనలకు పాతర

- మోరంపల్లిబంజరలో మూడు రోజులు సంత నిర్వహణ
- నిర్వహించాల్సింది రెండు రోజులే..
- అక్రమార్జనే ధ్యేయంగా కార్యకలాపాలు


బుధవారం మోరంపల్లిబంజరలో నిర్వహిస్తున్న పశువుల సంత

బూర్గంపాడు: గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చే వారపు సంతలు నిర్వహకులకు కాసులు కురిపిస్తున్నాయి. వారానికి ఒకరోజు నిర్వహించుకునే సంతను ఏకంగా మూడురోజులు నిర్వహిస్తు నిర్వహకులు అందినకాడికి దోచుకుంటున్నారు. జిల్లాలోనే రెండవ పెద్దసంతగా పేరుబడ్డ మోరంపల్లిబంజర సంతను మూడు రోజులు నిర్వహిస్తు పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. గతంలో మోరంపల్లిబంజర వారపు సంత ప్రతి శుక్రవారం నిర్వహించేవారు. కాలక్రమంలో ఈ సంతలో పశువుల క్రయవిక్రయాలు పెరగటంతో గురువారం, శుక్రవారం రెండురోజులు సంత నిర్వహించటం ప్రారంభించారు. గురువారం ఎక్కువగా పశువులు, జీవాల క్రయ విక్రయాలు జరుగుతాయి. శుక్రవారం కూరగాయలు, పండ్లు, నిత్యావసరాల సంత నడుస్తుంది. గత కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా సంతను బుధవారం కూడా నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో మోరంపల్లిబంజర సంత మూడురోజులు కొనసాగుతూ వచ్చింది. ఇటీవల ఈ సంతకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో సంతను కేవలం గురువారం, శుక్రవారం మాత్రమే నిర్వహించుకోవాలని అధికారులు నిబంధనలు విధించారు. వేలంపాట జరిగే సమయంలో కూడా గ్రామస్తులు రెండురోజులే సంత నిర్వహించాలని పట్టుబట్టారు. గ్రామపంచాయతీ అధికారులు కేవలం రెండు రోజుల నిర్వహణకే వేలంపాట నిర్వహించారు. 9 నెలల కాలవ్యవధికి గాను రూ.26.40 లక్షలకు ఓ వ్యక్తి వేలంపాటను దక్కించుకున్నారు. వేలంపాటలో పాల్గొన్న కొందరు బుధవారం కూడా సంత నిర్వహణకు అనుమతిస్తే ఇంకా ఎక్కువకు వేలంపాట పాడతామన్నారు. అయితే అధికారులు అందుకు నిరాకరించటంతో సంత వేలం పాట రూ. 26.40లక్షలకు ఖరారైంది. అయితే వేలంపాట అయిన తరువాత నిర్వహిస్తున్న సంతలు మాత్రం మూడురోజుల పాటు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా వందల పశువులు, జీవాలు సంతలో క్రయ విక్రయాలకు వచ్చాయి. దూర ప్రాంతాల నుంచి వాహనాలలో పశువులను, జీవాలను సంతకు తీసుకువచ్చారు. బుధవారం సంత నిర్వహణపై కొందరు అభ్యంతరాలను వ్యక్తం చేయటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం సంత నిర్వహించవద్దని పంచాయతీ అధికారులు సంత వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు సూచించారు. అయితే అప్పటికే పశువుల, జీవాల క్రయ విక్రయాలు ముగిశాయి. ఇందుకు సంబంధించి వ్యాపారుల నుంచి సంత నిర్వహకులు డబ్బులు వసూళ్లు చేశారు. వారంలో మూడురోజులు సంత నిర్వహించటంతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండిపడి, కాంట్రాక్టర్ జేబులు నింపుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. సంత ప్రాంతంలో గురు, శుక్ర వారాలలో మాత్రమే సంత నిర్వహణ ఉంటుందని బోర్డులు పెట్టిన బుధవారం కూడా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా సంత నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మోరంపల్లిబంజర సంతను కేవలం గురు, శుక్ర వారాలలో మాత్రమే నిర్వహించాలి. వేలంపాట సమయంలో నిబంధనలు తెలియజేశాం. బుధవారం కూడా సంత నిర్వహిస్తున్న సమాచారముంది. బుధవారం సంత నిర్వహించవద్దని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సంత వేలంపాటను రద్దు చేస్తాం.

– సునీల్, మండల పంచాయతీ అధికారి